పేర్చిన రాళ్లు కాదు.. శిథిల కల్వర్టు



ధారూర్ మండలం, నాగసమందర్ వెళ్లే దారిలో కల్వర్టు రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. తక్కువ ఎత్తులో ఉండడం వల్ల ఓ మాదిరి వర్షం పడినా రోడ్డుపై నీరు ప్రవహించి గంటల తరబడి రాకపోకలు నిలిచి పోతున్నాయి. అక్కడ భారీ వంతెన ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా స్పందించి నాగసమందర్ వెళ్లే రహదారిలో భారీ వంతెన నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ధారూర్.

ప్రభుత్వ భూమి విక్రయాన్ని రద్దు చేయండి



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సిరిగిరిపేట శివారునున్న 26 ఎకరాల ప్రభుత్వ భూమిని గత సర్కారు విక్రయించింది, దాన్ని రద్దు చేసి ఆ భూమిని గ్రామానికి కేటాయించాలని గ్రామస్థులు జిల్లా అదనపు పాలనాధికారి లింగ్యానాయక్‌ను కోరారు. ఈమేరకు గురువారం పాలనాధికారి కార్యాలయంలో అదనపు పాలనాధికారిని కలిసిన గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు. సర్కారు భూమిని కేటాయిస్తే అనుబంధ రహదారులు, వ్యవసాయ పొలాల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ప్రజోపయోగ భవనాల నిర్మాణాలకు స్థలం అందుబాటులో ఉంటుందన్నారు. గత ప్రభుత్వం చేసిన భూవిక్రయాన్ని రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ కార్యదర్శి విలాస్

తాండూరు: కేంద్ర ప్రభుత్వం చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని రాష్ట్ర ఏఐటీయూసీ కార్యదర్శి, జిల్లా ఇన్‌ఛార్జి విలాస్ విమర్శించారు. గురువారం తాండూరులో నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హక్కుల కోసం పోరాడేందుకు కార్మికులు ఐకమత్యంతో ఉండాలని చెప్పారు. జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షురాలు విజయ లక్ష్మీ పండిత్ మాట్లాడుతూ కార్మికులు ఎక్కువగా ఉన్న తాండూరులో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు కోసం ఎన్నో సార్లు కేంద్రమంత్రులు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు అందజేశామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి జైపాల్, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు బాల శంకర్, కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు పుష్కలం.. చెరకు సాగు ఆశాజనకం

అధిక దిగుబడిపై రైతుల్లో ఆశలు

న్యూస్‌టుడే, పెద్దేముల్:



ఎదుగుతున్న పంట

వానా కాలంలో కురిసిన అధిక వర్షాలకు జిల్లాలో మినుము, పెసర, కంది, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. రోజూ కురిసిన వానలకు చేతికి అందే దశలో పత్తి పంట సైతం పాడైపోయి నాణ్యత దెబ్బతింది. ఇవే వర్షాలు చెరకు సాగు రైతులకు మాత్రం ఆనందాన్నిస్తున్నాయి. ఎందుకంటే ఈ పంటకు ఎంత వాన కురిస్తే అంత మేలు. అందుకనే గతంలో కంటే ఈ ఏడాది దిగుబడి ఎక్కువ వస్తుందని రైతుల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఒకసారి పెట్టుబడి పెడితే మూడేళ్లపాటు మిగులు: జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల నాలుగేళ్లుగా సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. రెండేళ్లుగా మంచి వర్షాలు కురుస్తుండటం, మద్దతు ధర లభిస్తుండటంతో రైతులు చెరకు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకసారి పెట్టుబడి పెడితే మూడేళ్ల వరకు చెరకు పంటను సాగు చేయవచ్చు. మొదటి ఏడాది ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వరకు వ్యయం అవుతుంది. ఆ తర్వాత రెండేళ్లు ఎలాంటి పెట్టుబడి లేకుండా సాగు చేయవచ్చు. సంగారెడ్డిలోని గణపతి చక్కెర పరిశ్రమతో రైతులు ఒప్పందం చేసుకుంటున్నారు. ● ఈసారి సుమారు లక్ష టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఈ లెక్కన రూ.40 కోట్ల లావాదేవీలు జరగనున్నాయి. కోతల అనంతరం ఈ ఏడాది మద్దతు ధర నిర్ణయిస్తారు.

జిల్లాలో సమగ్రంగా ఇలా..
- మొత్తం సాగు.. 3,000 ఎకరాలు
- ఎకరాకు ఖర్చు.. రూ. 30,000
- ఎకరాకు దిగుబడి 30 టన్నులు
- గత ఏడాది టన్నుకు చెల్లింపు రూ. 3,800

ఈ గ్రామాల్లో అధికం

● పెద్దేముల్ మండలంలో అడ్కిచర్ల, ఇరికెటి తండా, బాయిమీది తండా, పాషాపూరు, రాంపూరు తండా, ఓమ్లానాయక్ తండా, తట్టేపల్లి, బండమీదిపల్లి, ఆత్కూర్, నర్సాపూరు, గోపాల్‌పూరు, సిద్దన్నమడుగు తండా, నాగులపల్లి, పెద్దేముల్, బుద్దారం, గాజీపూరు, మంబాపూరు, కందనెల్లి గ్రామాలు. ● బంట్వారం మండలంలో బోపునారం, తోర్మామిడి, బస్వపూర్, బంట్వారం, యాచారం, నూరుల్లాపూరు, రొంపల్లి, మద్వాపూర్ గ్రామాలు. ● కోట్‌పల్లి మండలంలో ఓగులాపూరు, అన్నాసాగర్, జిన్నారం, బీరోల్, బర్వాద్, మోత్కుపల్లి గ్రామాలు.

ఎకరాకు 60 టన్నుల దిగుబడి


– వడ్ల నర్సింలు, బుద్ధారం



తీవ్ర వర్షాభావ పరిస్థితి వల్ల రెండేళ్లు దిగుబడి సరిగా రాలేదు. గత ఏడాది బాగానే ఉంది. ఈ ఏడాది పంటకు కావాల్సినంత వాన కురిసింది. ఎకరాకు 60 టన్నుల వరకు దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా.

మంచి లాభాలు అందుతున్నాయి

– లాల్‌రెడ్డి, గాజీపూరు



చెరకు సాగుతో మంచి లాభాలు అందుతున్నాయి. నీటి తడులు చాలా ముఖ్యం. అన్ని రకాల వాతావరణాన్ని తట్టుకుంటుంది. అధిక వర్షాలు ఈ పంటకు ఎంతో మేలు చేశాయి.

కట్టింది విద్యార్థులకు.. ఉపయోగం పోలీసులకు!



న్యూస్‌టుడే, తాండూరు టౌన్: గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల్లో చదువుకోవటానికి వచ్చే మైనార్టీ విద్యార్థులకు వసతి కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం తాండూరులో మైనార్టీ భవనాన్ని హైదరాబాద్ రోడ్డు మార్గంలో రూ.2 కోట్లతో నిర్మించింది. రెండేళ్ల క్రితమే ప్రారంభించింది. అయితే నేటికీ వారికి ఉపయోగంలోకి రాలేకపోయింది. భవనం ఎవరికి ఉపయోగపడితే ఏంటి అని అధికారులు అనుకున్నారేమో.. ఎన్నికలు, ఇతర బందోబస్తు విధులు నిర్వర్తించటానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పోలీసు సిబ్బందికి అందులో వసతి కల్పిస్తున్నారు.

భర్త చేతిలో భార్య దారుణ హత్య

తాండూరు టౌన్: భర్త చేతిలో భార్య హత్యకు గురైన సంఘటన తాండూరులో గురువారం అర్ధ రాత్రి జరిగింది. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం.. యాలాల మండలం కమాల్‌పూరు గ్రామానికి చెందిన సుజాత(26)కు 8 ఏళ్ల కిందట ఓ వ్యక్తితో వివాహమైంది. అనంతరం భర్తతో కలిసి బతుకుదెరువు కోసం గుజరాత్‌కు వలస వెళ్లింది. అంతకుముందే కమాల్‌పూర్ నివాసి,వివాహితుడితో ఆమెకు పరిచయం ఉండటంతో నాలుగేళ్ల క్రితం ఆమె భర్తను వదిలి కమాల్‌పూర్ వచ్చి అతడిని రెండో పెళ్లి చేసుకుంది. ఇద్దరూ కలిసి పాత తాండూరు ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. గురువారం కూడా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మద్యం మత్తులో భర్త కర్రతో ఆమెను కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోడు భూములకు పట్టాలిచ్చేందుకు చర్యలు



అల్మాస్‌ఖాన్‌పేట్‌లో రైతుల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎమ్మెల్యే టీఆర్ఆర్

కుల్కచర్ల, న్యూస్‌టుడే: పోడు భూములపై అర్హులైన రైతులకు పట్టాలిచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. గురువారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్ గ్రామంలో మందిపల్, మక్త వెంకటాపూర్ గ్రామాల రైతులతో స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి సమావేశమయ్యారు. ఏళ్లుగా సాగులో ఉన్నామని తమకు అసైన్‌మెంట్ భూములను ఇవ్వాలని రైతులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంకా కొంత మంది రైతులకు పట్టాలను ఇవ్వాల్సి ఉందన్నారు. దీనికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే టీఆర్ఆర్ మాట్లాడుతూ పోడు భూములపై అర్హులైన వారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

కుల్కచర్ల గ్రామీణ: భూ సమస్యలను పరిష్కరించేలా చూస్తున్నామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. అల్మాస్‌ఖాన్‌పేట్ రైతుల భూముల సమస్యలు ఉండటంతో గురువారం రైతులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ.. అల్మాస్‌ఖాన్‌పేట్ రెవెన్యూ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని రైతులు పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదులు చేశారన్నారు. దీంతో ఎమ్మెల్యే చొరవతో భూముల సమస్యలు పరిష్కారించాలని సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఆర్డీవో, తహసీల్దార్ ఆధ్వర్యంలో ఐదు బృందాలను ఏర్పాటు చేసి సర్వే చేస్తామని చెప్పారు. రైతులు తమ దగ్గర ఎలాంటి నిజ ధ్రువీకరణ పత్రాలు ఉన్నా జిరాక్స్ కాపీలను అందజేయాలని సూచించారు. అనంతరం ఘనాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దారు మురళీధర్, ఎంపీడీవో రామకృష్ణనాయక్, నాయకులు భీంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను కొట్టారంటూ నిలదీత



హెచ్‌ఎంను ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కరణ్‌కోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎమ్.ఎ.భరీ విద్యార్థులను కొట్టారంటూ తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని నిలదీశారు. ఐదో తరగతి విద్యార్థులు గురువారం మధ్యాహ్న భోజనం చేసేందుకు తరగతి గదిలోకి వెళ్లారు. బల్లలపై కూర్చొని భోజనం చేస్తుండగా అక్కడికి వచ్చిన ప్రధానోపాధ్యాయుడు 'ఇక్కడెందుకు భోజనం చేస్తున్నారని' కర్రతో తమను కొట్టాడంటూ విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న తల్లిదండ్రుల ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. పిల్లలు చదవక పోతే కొట్టాలి కానీ భోజనం చేసేటప్పుడు ఎందుకు కొట్టారంటూ వాగ్వాదానికి దిగారు. ఉపాధ్యాయులు జోక్యం చేసుకొని మరోసారి పునరావృతం కాకుండా చూస్తామంటూ నచ్చజెప్పడంతో శాంతించారు. ఇదే విషయమై ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ..భోజనం చేసే సమయంలో విద్యార్థులు ప్లేట్లతో శబ్దం చేయడంతో మందలించానే తప్ప కొట్టలేదన్నారు.


ఉపాధి పనులు పారదర్శకంగా సాగాలి

యాలాల, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనులు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం యాలాల మండల కేంద్రలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 37 గ్రామ పంచాయతీల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి జిల్లా డీఆర్‌డీఓ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రజలకు పని కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తుందని, అందులో అవినీతికి తావులేదన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఏవీఓ భార్గవి తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

సరదాగా ఆడదాం.. సందడి చేద్దాం



విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకూడదు. ఆటలాడాలి. పాటలు పాడాలి. తద్వారా మానసిక వికాసం, ఆరోగ్యం రెండూ బాగుంటాయి. అందుకే విద్యార్థులను ఉపాధ్యాయులు ఆటలాడిస్తుంటారు. ధన్నారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్వరుద్దీన్, ఉపాధ్యాయురాలు ప్రభావతి గురువారం సాయంత్రం సమయం విద్యార్థులతో ఇలా వివిధ రకాల ఆటలాడించారు. ఖోఖో ఆడిస్తూ మరో ఉపాధ్యాయుడు వేమన పద్యాలు చదివించారు.

– న్యూస్‌టుడే, వికారాబాద్ గ్రామీణ.

కమనీయం.. లక్ష్మీ నరసింహుని కల్యాణం



పరిగి, న్యూస్‌టుడే: పట్టణంలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం నుంచి నిత్య హోమం, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు కనులపండువగా జరిగింది. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి, సిద్ధాంతి పార్థసారథి, మున్సిపల్ ఛైర్మన్ అశోక్‌కుమార్, విపణి మాజీ ఛైర్మన్లు ఆర్.ఆంజనేయులు, సురేందర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త ఎదిరె కృష్ణ పాల్గొన్నారు.

పనిచేయని సిగ్నళ్లు.. తప్పని తంటాలు



న్యూస్‌టుడే, తాండూరు: జిల్లాలో ముఖ్య వాణిజ్య పట్టణంగా పేరున్న తాండూరులో ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయక నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వాహనాలు క్రమపద్ధతిలో వెళ్లేందుకు ఇందిరాచౌక్, శివాజీ చౌక్, అంబేడ్కర్ చౌక్, విలియమ్ మూన్ చౌక్ వద్ద ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం 2017లో జిల్లా కలెక్టర్ సీజీఎఫ్ నిధులు, సిమెంటు కర్మాగారాలు విరాళంగా అందజేసిన నిధులు కలిపి అధికారులు రూ.16.37 లక్షలను వ్యయం చేశారు. అదే ఏడాది జూన్ 6న అప్పటి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఇక ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాలు సజావుగా సాగిపోతాయని అందరూ సంతోషించారు. అయితే కేవలం ఆరు నెలల పాటు సిగ్నళ్లు సవ్యంగా పనిచేయడంతో పట్టణంలో వచ్చిపోయే వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్త లేదు. తర్వాత సిగ్నళ్ల నిర్వహణ లేక పోవడంతో సమస్య మొదటికొచ్చింది.

అధిగమించబోయి ప్రమాదాలు

గడచిన ఏడేళ్లలో పట్టణంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివాసాలు ఏర్పర్చుకున్న వారే కాదు, స్థానిక జనాభా కూడా బాగా పెరిగింది. సిమెంటు పరిశ్రమలు ఇక్కడే ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి భారీ వాహనాల రాకపోకలు నిత్యం వందల సంఖ్యలో ఉంటున్నాయి. దీనికితోడు ద్విచక్ర వాహనదారులు ఎక్కువయ్యారు. ఇలాంటి తరుణంలో సిగ్నళ్లు పనిచేయక వాహనాలు అడ్డగోలుగా రాకపోకలు సాగించడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పోలీసులు కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు విధులు నిర్వహిస్తున్నా పెద్దగా ఫలితం ఉండడం లేదు. ఒకరిని మరొకరు అధిగమించబోయి గొడవలకు దిగుతున్నారు. ప్రమాదాల పాలవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మరమ్మతుకు గురైన సిగ్నళ్లను బాగు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పట్టణ వాసులు కోరుతున్నారు.

అన్ని వర్గాల వారికి సముచిత ప్రాధాన్యం: భాజపా

తాండూరు: దేశంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యమిచ్చేది భాజపానే అని రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం తాండూరు వ్యవసాయ విపణిలో నిర్వహించిన భాజపా సభ్యత్వ నమోదులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక నాయకులతో కలిసి పార్టీ సభ్యత్వాలను నమోదు చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాజపా కార్యవర్గ సభ్యులు యు. రమేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, జిల్లా సభ్యత్వ నాయకులు అంతారం లలిత, సాహూ శ్రీలత, భద్రేశ్వర్ పాల్గొన్నారు.

ఎర్రమట్టి తరలింపుదారుడికి జరిమానా



కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌లో డంప్ చేసిన ఎర్రమట్టి

తాండూరు, న్యూస్‌టుడే: సిమెంటు ఉత్పత్తిలో వినియోగించే ఎర్రమట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న లారీ తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తనిఖీల్లో పట్టుబడింది.విచారణ చేసి ఐదింతల జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే.. సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ గురువారం పెద్దేముల్ మండలం పాషాపూరు వైపు వెళ్లారు. అక్కడే 35 మెట్రిక్ టన్నుల లేటరైట్ లోడ్‌తో లారీ ఆగి ఉంది. గమనించిన ఆయన తనిఖీలు చేశారు. జరీనా మినరల్ పేరుతో ఉన్న రాయల్టీని పరిశీలించారు. అందులో బంట్వారం మండలం తొర్మామిడి గని నుంచి ఖనిజాన్ని తరలిస్తున్నట్లు ఉంది. డ్రైవర్ కలీమ్‌తో మాట్లాడారు. లేటరైట్ ఒక చోట తవ్వి మరో ప్రదేశానికి సంబంధించిన రాయల్టీ ఉండడాన్ని తప్పు పట్టారు. లారీని కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం గనుల శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ, పెద్దేముల్ తహసీల్దారు కిషన్‌తో సబ్‌కలెక్టర్ జరినా మినరల్స్‌కు సంబంధించిన వివరాలు అడిగారు. ఒక ప్రదేశంలో తవ్విన లేటరైట్‌కు మరో ప్రదేశానికి సంబంధించిన రాయల్టీని సమర్పించడం తప్పా కాదా అని ప్రశ్నించారు. ఇది తప్పేఅని గనుల శాఖ సహాయ పంచాలకులు సమాధానం ఇచ్చారు. దీంతో లారీలో 40.23 మెట్రిక్ టన్నుల లేటరైట్ అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు నిర్ధారించిన గనుల శాఖ రూ.37,393 జరిమాన విధించింది. ఆమేరకు యజమాని జహీర్ ఆన్‌లైన్‌లో డబ్బులను చెల్లించారు. కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌లో ఉన్న లారీ లేటరైట్‌ను అక్కడే ఖాళీ చేసి డ్రైవర్ తీసుకెళ్లారు.

ఉపాధి ఖాయం.. ఉన్నతికి దోహదం

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్, పరిగి:

● గ్రామీణ ప్రాంత యువతకు ఐటీఐ భరోసా



పారిశ్రామిక శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. తక్కువ సమయంలో కొలువులు సాధించాలనుకునే వారికి పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 500 సీట్లు ఉండగా ఇంకా కేవలం పదుల సంఖ్యలో మాత్రమే భర్తీ కావాల్సి ఉంది. వీటిని కూడా భర్తీచేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని నిర్వాహకులు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

1952లో జిల్లా కేంద్రంలో ఏర్పాటు

గ్రామీణ ప్రాంత విద్యార్థులు సాంకేతిక శిక్షణను పొందటానికి వికారాబాద్ సుభాష్‌నగర్ ప్రాంతంలో ప్రభుత్వ ఐటీఐని 1952లో ఏర్పాటు చేశారు. గతంలో వికారాబాద్ జిల్లా విద్యార్థులే కాకుండా పరిసర పట్టణాలైన సదాశివపేట, కోహీర్, చేవెళ్ల పట్టణాలకు చెందిన విద్యార్థులు కూడా ఇక్కడ శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు అందుకున్నారు. ఈ కేంద్రంలోని అన్ని ట్రేడుల్లో కలిపి కేవలం 35 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. గత మేలో సీట్లను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటి వరకు 7 విడతల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం అవకాశం కల్పించారు. తాజాగా 8వ విడత అవకాశం కల్పించారు.

- ● ప్రైవేట్‌లో మొత్తం సీట్లు 160
- ● భర్తీ: 147
- ● ఖాళీలు: 13

- ● ప్రభుత్వ ఐటీఐలు.. 2 (వికారాబాద్, మర్పల్లి)
- ● ప్రైవేట్‌లో: 2 (వికారాబాద్, కొత్తగడి, తాండూరు)
- ● మొత్తం సీట్లు: 340
- ● భర్తీ: 305 ● ఖాళీలు: 35

ఆంగ్ల మాధ్యమం, ఆన్‌లైన్‌కు అలవాటు పడక తప్పదు: ఐటీఐలలో గతంలో రాత పరీక్ష విధానంలో వార్షిక పరీక్షలు జరిగేవి. అయితే మూడేళ్లుగా ఆన్‌లైన్లో అదికూడా ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తున్నారు. వీటిలో చేరేవారు గ్రామీణ ప్రాంత నేపథ్యం ఉన్న వారు కావడంతో ఇంగ్లిష్ విషయంలో కొంత ఇబ్బంది పడుతున్నారు. దీనికి తగిన తర్ఫీదు పొంది అలవాటు పడాల్సిందేనని శిక్షకులు పేర్కొంటున్నారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మార్పు

ప్రభుత్వ ఐటీఐలు ఇకపై నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మారనున్నాయి. ఆధునిక సాంకేతిక కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. ఇందు కోసం తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. యువతకు ఉపాధి మార్గాలు పెంచేలా ఆధునిక కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇటీవల వికారాబాద్‌లో భవన నిర్మాణానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శంకుస్థాపన చేశారు.

సద్వినియోగం చేసుకోండి

ఐటీఐలో పూర్తి చేసే ఉపాధికి ఢోకా లేదు. కాబట్టి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి స్థాయిలో సీట్లు ఇంకా భర్తీ కావాల్సి ఉంది. అందుకనే 8వ సారి అవకాశం కల్పించాం. ఈనెల 30 వరకు గడువు ఉంది.

– ఆర్.నరేందర్‌బాబు, ప్రిన్సిపల్, ఐటీఐ, వికారాబాద్.

వాలుకు అడ్డు .. జల సవ్వడులే హద్దు!



పెద్దేముల్ మండలంలో ఇటీవలి వర్షాలతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. నర్సాపూర్ వంతెన వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్‌పైనుంచి గలగలా పారు వినసొంపైన సవ్వడులు చేస్తోంది. దారిన వెళ్లే వారు కాసేపు ఆగి ఆస్వాదించి వెళ్తున్నారు. – న్యూస్‌టుడే, పెద్దేముల్.

పూర్తిచేస్తే ఆదాయం.. వదిలేస్తే నష్టం



తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కరణ్‌కోట విపణిలో రూ.10 లక్షల జడ్పీ నిధులతో దుకాణ సముదాయ నిర్మాణం చేపట్టారు. పది దుకాణాలకు అనుగుణంగా పనులు ప్రారంభించారు. పునాదులు పూర్తయ్యాయి. ఒక అంతస్తులో శ్లాబ్ నిర్మించగా పై అంతస్తులో స్తంభాల వరకు పనులు పూర్తి చేశారు. గోడలు నిర్మిస్తే కింది భాగంలో ఐదు దుకాణాలు అందుబాటులోకి వస్తాయి. పై అంతస్తులో శ్లాబ్, గోడల పనులు పూర్తి చేయించాల్సి ఉంది. రెండు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉంచడంతో దుకాణ సముదాయం సమకూరడం లేదు. గత్యంతరంలేక కొందరు అసంపూర్తి సముదాయంలో మాంసం విక్రయిస్తుండగా కొనుగోలుదారులు, వ్యాపారులు అసౌకర్యానికి గురవుతున్నారు. పనులు పూర్తి చేయించి దుకాణాలను అందుబాటులోకి తెస్తే దుకాణాల్లో వ్యాపారాలు నిర్వహించి, స్వయం ఉపాధి పొందే వీలుంటుంది. అధికారులు వెంటనే మిగిలిన పనులు పూర్తి చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అడవిలో చెట్లు నరికితే కఠిన చర్యలు

యాలాల: యాలాల మండలంలోని రాస్నం, జుంటిపల్లి, బాణాపూర్, అడాల్‌పూర్ అడవిలోని చెట్లను నరికివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ అధికారి రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సంగాయిపల్లి తండాలో రాత్రి వేళల్లో కొంతమంది కావాలనే చెట్లు నరుకుతున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జైలుకు పంపుతామన్నారు. ఆర్ఎఫ్ఆర్ చట్టం ప్రకారం...ఇప్పటికే రెండు విడతలుగా 60 మందికి భూమి హక్కుపత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. అడవి సంరక్షణలో విధులకు ఆటంకం కల్గించిన వారికి శిక్ష తప్పదన్నారు. అడవి సంరక్షణతో పాటు వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత గ్రామస్థులపై ఉందన్నారు.

రుణ సహకారం.. అభ్యున్నతికి దోహదం

మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహిస్తున్న డీసీసీబీ

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిందే డీసీసీ బ్యాంకు. కర్షకులకు రుణాలు ఇస్తూ, వాటిని వసూలు చేస్తుంటుంది. అయితే ఇటీవల కాలంలో డీసీసీబీ తన పంథాను మార్చుకొని ముందుకు సాగుతోంది. మహిళలకూ సహకారం అందిస్తోంది. ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించడంలోనూ ముందుంటోంది. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సంఘాలకు రుణాల అందిస్తోంది. వసూలైన వడ్డీలో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లిస్తోంది. ఈ విషయంలో రాష్ట్రంలోనే మెదక్ డీసీసీబీ ముందంజలో నిలవడం విశేషం.

రాష్ట్రంలో మొత్తం తొమ్మిది డీసీసీబీలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఏర్పాటుచేశారు. వీటి ద్వారా మహిళా సంఘాలకు రుణాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా రూ.440.01 కోట్లు పంపిణీ చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో రుణ పంపిణీలో రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచి ప్రభుత్వ పురస్కారం అందుకుంది. ఈ సారి కూడా అదే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. నాబార్డు సహకారంతో మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత పెంచేందుకు కృషి చేస్తోంది.

ఐదేళ్లలో మహిళా సంఘాలకు అందించింది..

సంవత్సరం	రుణాల పంపిణీ (రూ.కోట్లలో)
2020-21	309.09
2021-22	325.40
2022-23	393.56
2023-24	420
2024-25	440.11

(అక్టోబరు 20 వరకు)

బీమాపై అవగాహన

ప్రధానమంత్రి బీమా పథకాలను మహిళా సంఘాల సభ్యులకు అమలు చేస్తున్నారు. ఏడాదికి రూ.12 చెల్లిస్తే ప్రమాద బీమా, రూ.330తో సాధారణ బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ప్రమాద బీమా చేసుకున్న వారు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.2 లక్షలు, సాధారణ బీమాలో చేరిన వారు ఆత్మహత్య మినహా ఎలా మృతిచెందినా రూ.2లక్షలు, రెండింటిలో చేరితే రూ.4లక్షలు సాయం అందిస్తారు. సభ్యులకు వీటిపై అవగాహన కల్పిస్తున్నారు.

రూ.2 లక్షలు తీసుకొని..



సంగారెడ్డి జిల్లా సంగుపేటకు చెందిన వజ్రమ్మ.. స్థానిక చైతన్య పొదుపు సంఘంలో సభ్యురాలు. 12 ఏళ్లుగా పొదుపు చేస్తూ వస్తున్నారు. డీసీసీబీ నుంచి రూ.2 లక్షల రుణం తీసుకొని.. కిరాణా దుకాణం, టీ హోటల్ నిర్వహిస్తున్నారు. దీని నిర్వహణతో వస్తున్న మొత్తాన్ని కుటుంబ పోషణకు వినియోగిస్తున్నారు. ప్రతి నెలా బ్యాంకు అధికారులకు క్రమం తప్పకుండా రుణ వాయిదాలు చెల్లిస్తున్నారు. - న్యూస్‌టుడే, జోగిపేట

నాటు కోళ్ల పెంపకంతో..



మెదక్ జిల్లా చేగుంట మండలం గొల్లపల్లి జైత్రాం తండాకు చెందిన నవ జ్యోతి మహిళా సంఘానికి చెందిన లక్ష్మి డీసీసీబీ నుంచి రూ.1.5 లక్షల రుణం తీసుకున్నారు. నాలుగు నెలల కిందట కోడి పిల్లల పెంపకాన్ని చేపట్టారు. 2,500 నాటు కోడి పిల్లలు తీసుకొచ్చి. . ఒక్కోటి 250 గ్రా. బరువు కాగానే విక్రయిస్తున్నారు. తీసుకున్న రుణాన్ని క్రమం తప్పకుండా చెల్లిస్తూ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. - న్యూస్‌టుడే, చేగుంట

5 శాతం తిరిగి చెల్లింపు

స్వయం సహాయక సంఘాలకు 12 శాతం వడ్డీపై రుణాలు అందిస్తున్నారు. హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో ఆయన చొరవతో డీసీసీబీ పరిధి సంగారెడ్డి జిల్లాలోని సంఘాలకు వడ్డీలో 5 శాతం తిరిగి చెల్లిస్తున్నారు. 2020 జులైలో ఇది మొదలైంది. ఈ మొత్తాన్ని సంఘాల అభ్యున్నతికి వెచ్చిస్తున్నారు. ఇప్పటివరకు రూ.1.50 కోట్లు జిల్లా సమాఖ్యకు అందజేయడం గమనార్హం. ఇలా వెనక్కి ఇచ్చిన వడ్డీలో ఒక శాతం జిల్లా సమాఖ్య, 2 శాతం మండల సమాఖ్యలకు, మిగతాది గ్రామైక్య సంఘాలకు కేటాయిస్తున్నారు.

సందడిగా ఎంపిక పోటీలు



క్రీడాకారులతో నాగరాజు, నగేష్, వంశీ, వినయ్

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: త్వరలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు సూచించారు. గురువారం మెదక్‌లోని అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. సిద్దిపేట, గజ్వేల్, సంగారెడ్డి, మెదక్, సదాశివపేట, జహీరాబాద్‌కు చెందిన 120 మంది పాల్గొన్నారు. జట్లుగా విభజించి పోటీలు కొనసాగించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు ఎం.అరుణ్ దినకరన్, శ్రీకాంత్, ఎం.డి.సొది, ఎం.జాన్‌పాల్‌లను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 25 నుంచి 30 వరకు హైదరాబాద్ జింఖానా మైదానంలో జరిగే శిక్షణ శిబిరానికి హాజరుకానున్నారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, సెలక్షన్ కమిటీ మెంబర్ నగేష్, ఫుట్‌బాల్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, వినయ్, శిక్షకుడు ప్రకాష్ పాల్గొన్నారు.

అఖిలభారత విశ్వవిద్యాలయాల ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక


చేగుంట: అఖిల భారత విశ్వవిద్యాలయాల ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలకు మెదక్ జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు శిక్షకుడు కరణం గణేష్‌రవికుమార్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో జరిగిన విశ్వవిద్యాలయాల కత్తిసాము పోటీల్లో ఫాయిల్ విభాగంలో కరణం నిశాంత్, ఈపీ విభాగంలో శ్రీశాంత్, ముఖేష్, సాబేర్‌లో జవదుద్దీన్, ఈపీలో రాజేశ్వరిలు ప్రతిభ చూపారు. వీరు నవంబరు 6 నుంచి 10 వరకు జమ్ములోని యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు.

27న స్వేరోస్ జాతీయ సభ

బెజ్జంకి, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో ఈ నెల 27న నిర్వహించే స్వేరోస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బలుగూరి దుర్గయ్య కోరారు. గురువారం బెజ్జంకిలో కమిటీ నాయకులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. సభకు స్వేరోస్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో హాజరయ్యేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మహనీయుల ఆశయాల సాధనతో పాటు విద్యార్థుల ఉజ్వల భవితకు స్వేరోస్ కమిటీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య, ప్రకాశ్, కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జి మారుతి, జిల్లా అధ్యక్షుడు బాబు, రాష్ట్ర నాయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ప్రేమ విఫలమైందని యువకుడు..



విశ్వసాయి

సిద్దిపేట టౌన్: ప్రేమ విఫలమై ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన బోదనకారి విశ్వసాయి (22) మొబైల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. కొన్నాళ్లకు వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. బుధవారం రాత్రి విశ్వసాయి బయటకు వెళ్లాడు. కోమటిచెరువులో దూకి చనిపోతున్నానంటూ మిత్రులకు చరవాణిలో సందేశం పంపించాడు. వారు యువకుడి కుటుంబసభ్యులకు చేరవేశారు. వారు అక్కడికి చేరుకునేసరికి చెరువులో దూకాడు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో వెతికి మృతదేహాన్ని వెలికితీశారు. తల్లి జయమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆర్థిక ఇబ్బందులతో అన్నదాత..



మహేందర్

చేర్యాల: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని మర్రిముచ్చాలకు చెందిన వంగ మహేందర్‌రెడ్డి(56), సత్యలక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. అకాల వర్షాలతో పంటలకు తెగుళ్లు సోకగా నష్టపోయాడు. రూ.2.01 లక్షల రుణమాఫీ కాలేదు. దీంతో మనస్తాపం చెందాడు. గురువారం భార్యతో కలిసి పొలానికి వెళ్లాడు. పంటకు పురుగు మందు పిచికారీ చేశాడు. భార్యను అక్కడే వదిలేసి ఇంటికొచ్చి పురుగు మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే చనిపోయాడని తేల్చారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మద్యం తాగొద్దన్నందుకు రైతు..



శ్రీనివాస్

దుబ్బాక: మద్యం తాగొద్దని కుటుంబీకులు చెప్పడంతో మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలు.. పెద్దగుండవెల్లికి చెందిన పంజ శ్రీనివాస్ (49)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరు నెలల క్రితం అతడికి గుండె శస్త్రచికిత్స జరిగింది. అప్పటి నుంచి మందులు వాడుతూనే రోజూ మద్యం తాగుతున్నాడు. ఈ నెల 22న రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చాడు. కుటుంబీకులు నిలదీయగా గొడవ పడడు. బుధవారం తెల్లవారుజామున పొలం వద్ద కొట్టంలోకి వెళ్లి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన కుటుంబీకులు 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య రాజమణి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కుటుంబ కలహాలతో..



నర్సింహులు

మాసాయిపేట (చేగుంట): కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. చేగుంట ఠాణా పరిధి మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి పులిగుట్టతండాకు చెందిన నర్సింహులు (45), శాంతి దంపతులకు ముగ్గురు కుమారులు. కొంతకాలంగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపం చెందిన నర్సింహులు బుధవారం రాత్రి పొలం వద్ద ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబీకులు లేచి చూసేసరికి కనిపించకపోవంతో అంతటా వెతికారు. పొలం వద్ద విగతజీవిగా కనిపించాడు. కేసు నమోదైంది.

చికెన్ ధరలు			
ఫాంరేటు	120-00	డ్రెస్డ్	206-00
రిటైల్	142-00	స్కిన్‌లెస్	234-00

ఆచరణలో ఆదర్శం.. స్వచ్ఛతలో మేటి

● సిద్దిపేటకు కితాబిచ్చిన 11 పురపాలికల అధికారులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: స్వచ్ఛతలో సిద్దిపేట బల్దియా ఆచరణాత్మకంగా, ఆదర్శంగా నిలిచిందంటూ రాష్ట్రంలోని వివిధ పురపాలికల కమిషనర్లు, అధికారులు కితాబునిచ్చారు. తడి, పొడి, హానికర చెత్త నిర్వహణలో మేటిగా మారిందంటూ ప్రశంసించారు. గురువారం రాష్ట్రంలోని 11 పురపాలికల కమిషనర్లు, అధికారులు సిద్దిపేటలో పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ అంశాలు తెలుసుకున్నారు. బల్దియా అధ్యక్షురాలు మంజుల, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, అధికారులు.. ఇక్కడి ప్రత్యేకతలను వివరించారు. తడి, పొడి, హానికర చెత్త వేర్వేరుగా సేకరణ తీరును తెలుసుకున్నారు. గృహ యజమానులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను పకలరించారు. బుస్సాపూర్‌లో సీఎన్‌జీ (బయో గ్యాస్) ప్లాంట్, ఎఫ్ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్), డీఆర్‌సీసీ (పొడిచెత్త వనరుల సేకరణ కేంద్రం)ని పరిశీలించారు. స్వచ్ఛబడి విశేషాలు తెలుసుకున్నారు. కోమటిచెరువును సందర్శించారు. వైస్ ఛైర్మన్ కనకరాజు తదితరులు ఉన్నారు. చేర్యాల, దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, జనగాం, నర్సంపేట, వర్ధన్నపేట, సిరిసిల్ల, ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్ పురపాలికల బృందాలు సందర్శించాయి. రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచిన మున్సిపాలిటీలను ఎంపిక చేశారని, వాటిలో సిద్దిపేట ఒకటని కమిషనర్ తెలిపారు. 46 పురపాలికల అధికారులు వస్తారన్నారు.



డీఆర్‌సీసీ కేంద్రం సందర్శనలో..

పీహెచ్‌సీలో యువకుడి దారుణ హత్య

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: గుర్తు తెలియని యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన చిన్నశంకరంపేటలో గురువారం జరిగింది. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపిన ప్రకారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తెరిచేందుకు గురువారం ఉదయం వైద్య సిబ్బంది, మండల వైద్యాధికారిణి సాయిసింధూ వెళ్లారు. ఆసుపత్రి వెనుకభాగంలో ఉన్న తలుపు తీయగానే ఓ యువకుడు రక్తం మడుగులో పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్సై నారాయణ ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. తెల్లవారు జామున దుండగులు బండరాయితో యువకుడిపై దాడి చేసి, ఇష్టానుసారం కొట్టి హతమార్చారు. అనంతరం మొక్కల రక్షణకు ఉంచిన ట్రీగార్డులను మృతదేహంపై వేసి దహనం చేసేందుకు ప్రయత్నించారు. ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మండల వైద్యాధికారిణి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని, సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని, యువకుడి వివరాలు తెలియాల్సి ఉందని డీఎస్పీ వివరించారు. పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న పీహెచ్‌సీలో ఈ ఘటన జరిగింది. దీంతో పట్టణ వాసులు భయాందోళనకు గురయ్యారు.



వివరాలను సేకరిస్తున్న క్లూస్‌టీం

అనంతగిరి.. పక్షుల లోగిలి



న్యూస్‌టుడే, వికారాబాద్ గ్రామీణ: వికారాబాద్ అనంతగిరిలో పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు మనసుదోచే ఆహ్లాదకర వాతావరణంతో పాటు వివిధ రంగుల్లో పక్షులు దర్శనమిచ్చి ప్రకృతి సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. అనంతగిరిలో మొత్తం 228 పక్షులు తలదాచుకుంటున్నాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. వింత శబ్దాలు చేస్తుంటే సందర్శకులకు అక్కడి నుంచి వెళ్లాలనిపించదు. పక్షి ప్రేమికులు హైదరాబాద్ బర్డ్స్ అసోసియేషన్ వారు ప్రతి సంవత్సరం అనంతగిరి సందర్శించి పక్షుల చిత్రాలు తీస్తుంటారు. పాలపిట్ట, బ్లాక్‌డ్రోంగో, డవ్, రోజ్ బర్డ్ తదితర పక్షులు అడవిలో అలరిస్తున్నాయి. పక్షుల వివరాలు తెలుసుకునేందుకు నడకదారిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు మాత్రమే కనిపిస్తాయని సభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృత్యువాత



నాగరాజు

రామాయంపేట: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. రామాయంపేట ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని ఝాన్సీలింగాపూర్‌కు చెందిన నాగరాజు (36), లత దంపతులకు ముగ్గురు సంతానం. నాగరాజు తనకున్న రెండెకరాలను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లగా, పంటకు నీరు పారించాలని మోటారు ఆన్ చేసేందుకు స్టార్టర్ డబ్బా వద్దకు వెళ్లాడు. ఫ్యూజ్ సరిచేసే క్రమంలో విద్యుత్తు తీగ తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడున్న వారు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదైంది.

చేపలవేటకు వెళ్లి..



సర్వాల్‌సింగ్

కుల్కచర్ల, న్యూస్‌టుడే: చేపలు పట్టేందుకు కుంటకు వెళ్లిన వ్యక్తి అందులోనే మునిగి మృతి చెందిన సంఘటన కుల్కచర్ల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సర్వాల్‌సింగ్ (36) ఇనుప సామాన్ల దుకాణంలో కూలీ. గురువారం స్థానిక కుంటలో చేపలను పట్టేందుకు వెళ్లాడు. ఈత రాకున్నా.. స్నానం చేసేందుకు అందులోకి దిగుతుండగా అతడి బంధువు వారించాడు. అయినా వినకుండా దిగి నీటమునిగిపోయాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. అతడికి ఇద్దరు కూతుళ్లు, ముగ్గురు కుమారులున్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ..

అల్లాదుర్గం: రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందాడు. మెదక్ జిల్లా అల్లాదుర్గం ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని సీతానగర్‌కు చెందిన వెంకయ్య (60), తులసమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వెంకయ్య గురువారం పెద్దశంకరంపేటలో జరిగిన వారాంతపు సంతకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నాగయ్య ఆటో ఎక్కాడు. మార్గమధ్యలో రాంపూర్ శివారులో రాగానే ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవరు నాగయ్యకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రుడిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందనేది తెలియరాలేదు. ఘటనాస్థలిలో ట్రాక్టరు వెళ్లిన ఆనవాళ్లు ఉన్నాయని, అది తగిలి ఆటో బోల్తా పడొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పాదచారిని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి



కరుణాకర్

వర్గల్: ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా శునకం అడ్డు రాగా అదుపు తప్పి.. రోడ్డు దాటుతున్న మరొకరిని ఢీకొట్టగా.. ద్విచక్రవాహనదారులు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వర్గల్ ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మర్కూక్ మండలం పాములపర్తికి చెందిన నీల కరుణాకర్(29) వంటిమామిడి సమీపంలోని ఓ కంపెనీలో ఉద్యోగి. బుధవారం రాత్రి విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికెళ్తున్నాడు. రాజీవ్ హదారిపై అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో రోడ్డు దాటుతున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్‌ను బైక్‌తో ఢీకొట్టాడు. గాయపడిన ఇద్దరినీ 108 వాహనంతో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కరుణాకర్ పరిస్థితి విషమించడంతో లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కరుణాకర్ సోదరుడు శేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కుమారుడికి అన్నీ తానై తల్లి అంత్యక్రియలు



దుబ్బాక, న్యూస్‌టుడే: చేతికొచ్చిన కొడుకు అండగా ఉంటాడనుకుంది. కానీ అనారోగ్యంతో మృతిచెందడంతో తల్లి అంత్యక్రియలు నిర్వహించిన హృదయ విదారక ఘటన దుబ్బాకలో గురువారం చోటుచేసుకుంది. వివరాలివీ.. 13వ వార్డుకు చెందిన బెల్లె రాజవ్వకు ఇద్దరు కూతుళ్లు(వివాహాలు జరిగాయి), ఒక కుమారుడు. రాజవ్వ భర్త మల్లయ్య కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు కనకరాజు(25) కూలీ పని చేస్తూ తల్లిని పోషించేవాడు. మూడు నెలలుగా తీవ్ర అనారోగ్యం బారిన పడి బుధవారం రాత్రి ములుగు ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా తల్లి అంత్యక్రియలు నిర్వహించింది. తోడుగా ఉంటాడనుకున్న కుమారుడికి కన్న తల్లి అంత్యక్రియలు చేపట్టడం స్థానికులను కలచివేసింది.

ఆత్మరక్షణ విద్యకు వెన్నుదన్ను

రూ.15వేల చొప్పున నిధుల మంజూరు

న్యూస్‌టుడే, సిద్దిపేట, హుస్నాబాద్ గ్రామీణం, చేగుంట, వికారాబాద్ కలెక్టరేట్

నిత్యం మహిళలు, బాలికలపై ఎక్కడో ఓ చోట దాడులు జరుగుతూనే ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు బాలికలకు ఆత్మవిశ్వాసం పెరిగేలా, స్వీయరక్షణకు ఉపయోగపడేలా ప్రభుత్వం ఆత్మరక్షణ విద్య కరాటే నేర్పిస్తోంది. ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేసింది. ఈ మేరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు పాఠశాలలను ఎంపిక చేయగా, నిర్దేశించిన కాలంలో శిక్షణ ఇవ్వనున్నారు.



కరాటే నేర్చుకుంటున్న బాలికలు

879 పాఠశాలల్లో..

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో రాణి లక్ష్మి బాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ పేరిట కరాటే సాధన చేయించనున్నారు. ఇందుకు ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూర్బా పాఠశాలలను ఎంపిక చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగు జిల్లాల్లోని 699 పాఠశాలల్లో దీన్ని అమలు చేస్తున్నారు. నవంబరు నుంచి మూడు నెలల పాటు దీన్ని కొనసాగిస్తారు. ఆయా ప్రాంతాలకు చెందిన శిక్షకులను నియమించారు.

కరాటే శిక్షణకు ఎంపిక ఇలా..

	పాఠశాలలు	నిధులు(రూ.లక్షల్లో..)
మెదక్	191	28.65
సంగారెడ్డి	250	37.50
సిద్దిపేట	258	38.71
వికారాబాద్	180	27.00

వారానికి రెండు తరగతులు

శిక్షకులకు సొంత మండలంలోని పాఠశాలల బాధ్యత అప్పగించారు. వీరు వారానికి రెండు తరగతుల చొప్పున ఆత్మరక్షణ విద్య నేర్పిస్తారు. నెలకు రూ.5 వేల చొప్పున వేతనం చెల్లిస్తారు. ఒక్కో పాఠశాలకు రూ.15 వేల చొప్పున మంజూరయ్యాయి.

నైపుణ్యాలు నేర్పిస్తాం:



పాఠశాలల్లో బాలికలకు కొన్నేళ్లుగా కరాటే నేర్పిస్తున్నా. ఎవరైనా దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పిస్తూ సొంతంగా రక్షించుకునేలా విద్య నేర్పిస్తున్నాం. దీని ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ధైర్యంగా వెళ్లగలుగుతారు.

భూక్యా రమేశ్, కరాటే శిక్షకుడు

వచ్చే నెల 1 నుంచి..:



కరాటే శిక్షణకు నిధులు మంజూరయ్యాయి. ఇన్‌స్ట్రక్టర్ల నియామకం కూడా పూర్తయింది. ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయి. నవంబరు 1 నుంచి నిధులు మంజూరైన అన్ని పాఠశాలల్లో శిక్షణ ప్రారంభిస్తాం. బాలికలకు ఆత్మరక్షణ విద్య చాలా అవసరం. వారిలో ఆత్మవిశ్వాసాన్ని, మనోధైర్యాన్ని నింపుతుంది.

శ్రీనివాసరెడ్డి, సిద్దిపేట డీఈవో

కలగన్నారు.. ఖాకీ ధరించారు!



రికార్డులు తనిఖీ చేస్తున్న శిక్షణ ఎస్సై హారిక

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

పోలీసు యూనిఫాం ధరించాలనేది వారి కల.. కష్టాలకు ఎదురీది దాన్ని నిజం చేసుకున్నారు. సంకల్పం, పట్టుదల ఉండాలే ఖాకీ దుస్తులు ధరించడం కష్టమేమి కాదని నిరూపించారు ఈ ముగ్గురు యువ మహిళా ఎస్సైలు. పోలీసు నియామక పరీక్షలో ఉద్యోగాలు సాధించి సంగారెడ్డి జిల్లాలో సబ్ ఇన్‌స్పెక్టర్ శిక్షణలో ఉండటం విశేషం.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, పటాన్‌చెరు, అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్లలో శిక్షణ ఎస్సైలుగా వికారాబాద్ జిల్లాకు చెందిన ఎ.హారిక, డి.కావేరి, హిమబిందు నెల రోజుల శిక్షణ పొందుతున్నారు. కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ నిర్వహించే విధులు సహా పెట్రోలింగ్, బ్లూకోల్ట్, పగలు, రాత్రి వేళల్లో వాహన తనిఖీలు, కోర్టు విధులు, నేరాలు జరిగినప్పుడు స్పందించాల్సి విధానంపై అవగాహన పెంచుకుంటున్నారు. ఆయా పోలీస్ స్టేషన్‌లోని ఎస్సైల సహకారంతో విధులు, బాధ్యతలు తెలుసుకుంటున్నారు.

యూనిఫామ్‌పై మక్కువతో..

నా పేరు ఎరువ హారిక. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం చీమలదరి స్వగ్రామం. అమ్మ బాలమణి టైలర్, నాన్న శేఖర్ ప్రైవేటు పరిశ్రమలో పని చేసున్నారు. వారు కష్టపడి నన్ను పీజీ చదివించారు. తమ్ముడు సూర్యకిరణ్ ఫ్లయింగ్ అధికారిగా పనిచేస్తున్నాడు. పోలీసు యూనిఫామ్ ధరించాలని చిన్నపటి నుంచి కోరిక. టీజీపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అవుతుండగా ఎస్సైల భర్తీ ప్రకటన వచ్చింది. ఓ సారి ప్రయత్నిద్దామని దరఖాస్తు చేశా. తొలి ప్రయత్నంలోనే అవకాశం దక్కింది. మా కుటుంబంలో నేనే తొలి ప్రభుత్వ ఉద్యోగిని కావడం ఆనందంగా ఉంది.

ఉపాధ్యాయురాలు కావాలనుకొని..



నా పేరు దూది కావేరి. మాది వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం గాంధీచౌక్ ప్రాంతం. అమ్మ నిర్మల గృహిణి, నాన్న వీరేశం సెక్యూరిటీ సూపర్‌వైజర్, అన్నయ్య భానుప్రసాద్. పాఠశాల విద్యను తాండూరులోని శిశు మందిర్, ఇంటర్ హైదరాబాద్‌లో చదివా. డీఈడీ టీచర్ శిక్షణ పూర్తి చేశా. అనంతరం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశా. ఉపాధ్యాయురాలు కావాలని టీటీసీ పూర్తి చేసినా.. ఎస్సై నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేశారు. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం వచ్చింది.

గ్రూప్స్‌కి సిద్ధమవుతుండగా..



నా పేరు నాంచెరి హిమబిందు. వికారాబాద్ పట్టణం పులుసు మామిడి స్వగ్రామం. నాన్న రాంరెడ్డి జీహెచ్ఎంసీ ఉద్యోగి, అమ్మ లక్ష్మి గృహిణి. తమ్ముడు హర్షవర్ధన్‌రెడ్డి సివిల్స్ శిక్షణ పొందుతున్నాడు. నర్సాపూర్ బీవీఆర్ఐటీలో ఈఈఈ పూర్తి చేయగా ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగం వచ్చింది. దాన్ని కాదనుకొని గ్రూప్స్ సాధించాలని సిద్ధమయ్యా. ఎస్సై నోటిఫికేషన్ రావడంతో ప్రయత్నించా. తొలి ప్రయత్నంలోనే ఎస్సై ఉద్యోగం సాధించా. లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమిస్తే సాధించడం కష్టమేమి కాదు.

నేడు లగచర్లకు అధికారుల రాక

దుద్యాల: లగచర్లకు నేటి (శుక్రవారం) ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ రానున్నట్లు తహసీల్దార్ బి.వెంకటేశ్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 102 సర్వే నంబరులో ప్రభుత్వ భూమి కలిగిన పట్టాదారు రైతులు సమావేశంలో పాల్గొనాలని తెలిపారు.

పిన్‌కుంట చెరువుకు మరమ్మతులు చేయిస్తాం


జలవనరును పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ డీఈఈ

దుద్యాల: మండల పరిధిలోని సంత్రకుంటతండా గ్రామం నాన్యానాయక్ తండాలోని పిన్‌కుంట చెరువుకు మరమ్మతులు చేయిస్తామని నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిరణ్ కుమార్ అన్నారు. ఈ చెరువులోని తూముకు రంధ్రం ఏర్పడి నీరు వృథాగా పోతోందని, కట్టను బాగు చేయాలంటూ గ్రామస్థులు ఇచ్చిన వినతి పత్రానికి ఆయన స్పందించి గురువారం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తూము పాడైపోయిన విషయం వాస్తవమేనని, కట్టకు సైతం మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పది రోజుల్లో అంచనా వేసి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రత్యేకాధికారికి నివేదిస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు రవినాయక్, రాహుల్ పాల్గొన్నారు.



పేరుకే ప్రాజెక్టు..
తగ్గుతున్న ఆయకట్టు

కాకరవాణి దుస్థితి

న్యూస్‌టుడే, బొంరాస్‌పేట

చిన్నతరహా సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. సరైన నిర్వహణ లేక ఆయకట్టుకు నీరందించలేక పోతున్నాయి. ఎత్తిపోతల పథకాలు, సాగునీటి వనరులు లేని బొంరాస్‌పేట మండలంలో నిర్మించిన ఈ ప్రాజెక్టు ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదు. కొడంగల్ నియోజకవర్గంలో పేరుకు మాత్రమే ఇది ప్రాజెక్టుగా రికార్డుల్లో ఉంది. కానీ అందుకు తగ్గట్టుగా దీని వెనుక ఉన్న ఆయకట్టు మాత్రం సాగు కావడం లేదు. 1969లో రూ.17 లక్షల వ్యయంతో 1,780 ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. కానీ ప్రస్తుతం తుంకిమెట్ల, ఏర్పుమళ్లలో కలిపి 300 ఎకరాల వరకే సాగవుతోంది.

ఇదీ పరిస్థితి

- కాలువల పర్యవేక్షణకు గతంలో ఇద్దరు గ్యాంగ్‌మెన్లు ఉండే వారు. ఇప్పుడు ఎవరూ లేరు.
- నీరడీలు లేకపోవడంతో రైతులే కాలువలు పర్యవేక్షిస్తున్నారు.
- పంట కాలువలను మరమ్మతు చేయకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందక రైతులు అవస్థలు పడుతుంటారు.
- ప్రాజెక్టు నీటి ద్వారా తుంకిమెట్ల గ్రామానికి చెందిన రైతులు యాసంగిలో వేరుశనగను పండించేవారు. కానీ అధ్వానంగా మారిన కాలువల వల్ల సాగు నీరు అందే పరిస్థితి లేక రైతులు పంటల సాగును మానుకున్నారు.
- కొందరు రైతులు బోర్లు వేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు.
- ప్రాజెక్టును సందర్శించే వారి కోసం నిర్మించిన అతిథి గృహం శిథిలమైంది. ఏర్పుమళ్ల నుంచి ప్రాజెక్టు వరకు ఉన్న రహదారి కూడా అధ్వానంగా తయారైంది.


నీరందించే కాలువలో పొదలు

అక్రమంగా నీటి వాడకం

కాకరవాణి ప్రాజెక్టు ఎగువ భాగంలో దోమ మండలానికి చెందిన కొందరు రైతులు ప్రాజెక్టులో మోటార్లను పెట్టి అక్రమంగా నీటిని తరలించి యాసంగిలో సుమారు 300 ఎకరాల వరకు వరి పంటలను సాగు చేస్తుంటారు. దీనివల్ల ప్రాజెక్టు కింద వరిపంట సాగు చేసిన రైతులకు చివర్లో సాగు నీరు అందడం లేదు. పంట చేతికి వచ్చే దశలో నీరందక ఎండిపోతుంటే వాటిని కాపాడుకోవడానికి రైతులు ఆయిల్ ఇంజిన్లు పెట్టి పంటలకు నీరందిస్తుంటారు. ఇది రైతులకు ఆర్థికంగా భారమవుతుంది. అక్రమ నీటి వాడకాన్ని అరికడితే ఆయకట్టు రైతులకు పుష్కలంగా నీరందుతోంది. అక్రమ నీటి వాడకంపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు.

బాగు చేయిస్తాం..

కాకరవాణి ప్రాజెక్టు ఎగువ భాగంలో అక్రమంగా నీటిని వాడుకుంటున్న వారి విషయంలో గతంలో జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులతో కలిసి సర్వే నిర్వహించాం. ప్రాజెక్టు లోపలి భాగంలో మోటార్లు పెట్టి నీటిని వాడుకుంటున్న రైతులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు తెలిపాం. మానవతా కోణంలో చర్యలు తీసుకోవడం లేదు. పంట కాలువల మరమ్మతు విషయానికి వస్తే ఎంపీడీవోతో చర్చించి ఉపాధిహామీ పథకంలో బాగు చేయడానికి ప్రయత్నిస్తాం.

కిరణ్‌కుమార్, నీటిపారుదల శాఖ డీఈ

సీఎం పైనే ఆశలన్నీ..

కాకరవాణి ప్రాజెక్టు అభివృద్ధిపై ఆయకట్టు రైతులు సీఎం రేవంత్‌రెడ్డిపై ఆశలు పెట్టుకున్నారు. ఇన్నాళ్లూ నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టుకు అధిక మొత్తంలో నిధులు మంజూరు చేసి పొలాలకు నీరందిస్తారని భరోసాతో ఉన్నారు. ప్రాజెక్టులో నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగు నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, దోమ: ? రాకొండ బ్రాహ్మణపల్లి శివారు ప్రాంతంలో విద్యుత్తు స్తంభాలు నేలకొరిగి తీగలు చెట్లకు తాకుతూ.. ప్రమాదకరంగా ఉన్నాయి. సరి చేయించండి. – వెంకటయ్య, రాకొండ

✓ విద్యుత్తు శాఖ సిబ్బంది దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. - మహేష్‌బాబు, ఎంపీడీవో దోమ.

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: ? బలభీమసేన దేవాలయం సమీపంలో పొదలు ఏపుగా పెరిగి వాహన దారుల రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. – అంజయ్య, దౌల్తాబాద్

✓ పంచాయతీ కార్మికుల సాయంతో వెంటనే ఆప్రాంతంలోని పొదలను తొలగించి పరిసర ప్రాంతాలను శుభ్రపడేలా చర్యలు తీసుకుంటాం. – గోపాల్, పంచాయతీ కార్యదర్శి, దౌల్తాబాద్

న్యూస్‌టుడే, పూడూరు: ? ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్ మోటారు వద్ద నీరు నిత్యం వృథాగా పోతుంది. స్థానిక సిబ్బంది పట్టించుకోవటం లేదు. – నర్సింలు, గొంగుపల్లి

✓ బోరువద్ద ఆన్‌ఆఫ్ మీటలు ఏర్పాటు చేయించాం. కొందరు నీళ్లు పట్టుకొని అలాగే వెళ్తుండడంతో సమస్య వస్తోంది. పరిశీలించి కట్టడి చేస్తాం. – శృతి, పంచాయతీ కార్యదర్శి

కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

కొడంగల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం అంబేడ్కర్ కూడలిలో పార్టీ తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితులకు నివాసాలు ఇస్తామని ప్రకటించి ఇందిరమ్మ కమిటీల పేరుతో నాయకులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాస్, చంద్రయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించడం అభినందనీయం

కుల్కచర్ల గ్రామీణ: విద్యార్థులు క్రీడల్లో రాణించడం అభినందనీయమని సాల్వీడ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచందర్ అన్నారు. సాల్వీడ్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడంతో వారిని అభినందించారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

పూడూరు: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తపల్లి, మేడిపల్లికలాన్ గ్రామంల దాదాపు 350 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్తపల్లి మాజీ సర్పంచి పాపిరెడ్డి, అధికారులు కల్యాణి, సుజాత్ అలీ తదితరులు కార్యక్రమంలో ఉన్నారు.

కలప తరలిస్తున్న వాహనం పట్టివేత

ధారూర్: అనుమతుల లేకుండా కలప తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో కోట్‌పల్లి కూడలి నుంచి వస్తున్న డీసీఎం వాహనాన్ని తనిఖీ చేయగా అది కలపతో నిండి ఉందన్నారు. డ్రైవర్ దగ్గర పత్రాలు లేకపోవడంతో.. వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు మరమ్మతులు పట్టవా?

దౌల్తాబాద్: గోకఫస్లావాద్ నుంచి సుంకరనగర్ వరకు మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవలి వర్షాలకు వాటిలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో, అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆ గ్రామాల వాసులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పీఆర్ఏఈ రవికిరణ్‌తో ప్రస్తావించగా.. మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చడానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

ఆత్మగౌరవసభ గోడ ప్రతుల విడుదల

పరిగి: నాగర్‌కర్నూల్‌లో ఈనెల 27న జరగనున్న ఆత్మగౌరవసభ గోడ ప్రతులను గురువారం పట్టణంలో మాలమహానాడు నాయకులు విడుదల చేశారు. పరిగి నియోజకవర్గం నుంచి సభకు పెద్దఎత్తున తరలుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, అంబేడ్కర్ విజ్ఞాన వేదిక అధ్యక్షుడు ముత్యప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు.

ఏ మలుపులో.. ఏం ముప్పో!

బెంబేలెత్తుతున్న వాహనదారులు

న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ, దోమ:

రహదారుల మలుపుల కారణంగా వాహనదారులు ప్రమాదాల్లో పడుతున్నారు. పరిగి ప్రాంతంలో రోజు రోజుకూ భారీ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో.. అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపుల్లో పొదలు, చెట్లు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కంటికి కనిపించక పోవడం గమనార్హం.


చిట్యాల పరిసరాల్లో ప్రమాదకరంగా..

మచ్చుకు కొన్ని..

- పరిగి మండల పరిధిలోని చిట్యాల గ్రామ పరిసరాల్లో పరిగి-షాద్‌నగర్ రహదారిపై ఉన్న మలుపు కారణంగా చాలా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవలే ఓ భారీ సిమెంటు ట్యాంకరు అతి వేగంగా వస్తూ.. డీసీఎంను ఢీ కొట్టింది. ఈప్రమాదంలో డీసీఎం డ్రైవరు దుర్మరణం పాలయ్యాడు.
- బీజాపూర్ రహదారిపై రంగాపూర్, హన్మాన్‌గండి వద్ద రెండు మలుపులు ప్రమాదకరంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- కొడంగల్ వెళ్లే దారిలో చింతల్ చెరువు ప్రాంతంలోనే మలుపు ఉండడంతో ప్రతి ఏటా పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి.. పలువురు మృత్యువాత పడ్డారు.
- సుల్తాన్‌పూర్ శివారులో జాతీయ రహదారిపైనా ఇదే దుస్థితి. ఇటీవల జరిగిన మూడు ప్రమాదాల్లో ముగ్గురు చనిపోయారు.


సుల్తాన్‌పూర్ పరిసరాల్లో నుజ్జయిన ద్విచక్రవాహనం

- రాఘవాపూర్ గ్రామ పరిసరాల్లో మలుపు పక్కనే పురాతన వ్యవసాయ బావి ఉండడంతో తరచూ వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి.
- పరిగి నుంచి దోమ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఊటుపల్లి, తిమ్మాయిపల్లి దగ్గర ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురై ముగ్గురు యువకులు ఘటనా స్థలంలోనే మృతి చెందారు.
- ఐనాపూర్- పాలేపల్లి మధ్యలో ఇటీవల ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది.
- దిర్సంపల్లి- దోమ రహదారిపై సుమారు ఎనిమిది మలుపులు ఉండడంతో వాహనదారులు భయం భయంగా నడుపుతారు.

సూచికలు ఏర్పాటు చేయిస్తాం..

రహదారులపై ప్రమాదకరంగా ఉన్న మలుపుల దగ్గర ప్రమాదాలు జరగకుండా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో చర్చించి తగిన రక్షణ చర్యలు తీసుకుంటాం. అవసరం ఉన్న చోట సూచికలు ఏర్పాటు చేస్తాం. –సంతోష్, ఎస్సై, పరిగి

మహిళా సంఘాలకు రూ.34 కోట్ల రుణాలు


ఆర్థిక నివేదికను ప్రదర్శిస్తున్న అధికారులు

పెద్దేముల్, న్యూస్‌టుడే: 2023-24 ఆర్థిక సంవత్సరానికి మహిళా సంఘాలకు రూ.34కోట్ల రుణాలు అందజేసినట్లు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అండాలమ్మ తెలిపారు. గురువారం కార్యాలయం ఆవరణలో మండల మహిళా సమాఖ్య 16వ సర్వసభ్య సమావేశం జరిగింది. సామాజిక పెట్టుబడి నిధి కింద 186 సంఘాలకు రూ.40లక్షలు, బ్యాంకు లింకేజీ కింద 470 సంఘాలకు రూ. 32 కోట్లు, స్త్రీ నిధి కింద 580 సంఘాలకు రూ.2.29 కోట్ల నిధులను పంపిణీ చేసినట్లు వివరించారు. 37 గ్రామసంఘాల నుంచి పొదుపు, వాటాధనం కింద రూ.5,94,224 నిధులను సమీకరించినట్లు తెలిపారు. జిల్లా సమైక్యలో వాటాధనంగా రూ.58 లక్షలు డిపాజిట్లుగా పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. మహిళల ఆర్థిక పురోభివృద్ధికి కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రుణ వసూలు జరగని సంఘాలపై ప్రత్యేక దృష్టిని పెట్టినట్లు పేర్కొన్నారు. కొత్త సంఘాలకు ఆర్థిక అక్షరాస్యత, సంఘం నిర్వహణపై శిక్షణ ఇస్తున్నట్లు జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎంపీడీవో జర్నప్ప, ఏపీఎం బాలయ్య, మండల సమాఖ్య ఉపాధ్యక్షురాలు యశోద, కార్యదర్శి అక్షయ, సహాయ కార్యదర్శి పద్మమ్మ, కోశాధికారిణి మంజుల, సీసీలు సత్యనారాయణ, లక్ష్మయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం ఇవ్వండి

కుల్కచర్ల: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీని తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. సకాలంలో విధులకు హాజరు కావాలని, సకాలంలోనే పాఠ్యాంశాలు పూర్తి చేయాలన్నారు. గిరిజన తండాలకు చెందిన విద్యార్థులే అధికంగా ఉన్నారని, వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యాబోధన చేయాలని చెప్పారు.

నేడు పెద్దఉమ్మెంతాల్‌లో మానసపూజ

పూడూరు, న్యూస్‌టుడే: పెద్దఉమ్మెంతాల్ తిరుమలనాథస్వామి ఉత్సవాల సందర్భంగా రోజువారీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మానసపూజ, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ముగింపు సందర్భంగా సన్మానాలు, తీర్థప్రసాదాల వితరణ ఉంటుందన్నారు.

తాగునీటి వృథా



మోమిన్‌పేట, న్యూస్‌టుడే: తాగునీటి ఆదాపై పంచాయతీ అధికారులు అవగాహన కల్పించడం లేదు. దీంతో చాలా కాలనీల్లో చుక్క చుక్కగా నీరంతా వృథా అవుతోంది. మోమిన్‌పేటలోని బసవేశ్వర చౌక్ సమీపాన సంతదారులు, కాలనీవాసుల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ ప్రత్యేక బోరు వేయించి తాగునీటి వసతి కల్పించింది. కాలనీవాసులు నీటి పొదుపు పాటించక పోవడం వల్ల నిత్యం నీటి వృథా అవుతోంది.

వ్యవసాయ క్షేత్రంలో చోరీ

పెద్దేముల్: రేవండీ గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో రూ.78 వేల విలువైన సామగ్రి చోరీ జరిగింది. యజమాని హైదర్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై గిరి తెలిపిన ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన గణేష్, చిన్న అనే వ్యక్తులు రేగొండికి చెందిన హైదర్ ఫామ్ హౌస్‌లో నెలరోజుల క్రితం గుర్రాలను చూసుకోవడానికి పనికి కుదిరారు. 22వ తేదీ రాత్రి సురేష్ అనే మరో కూలీతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం గణేష్, చిన్న కనిపించకుండా పోయారు. ఈ విషయాన్ని సురేష్ యజమాని హైదర్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. ఆయన వ్యవసాయ క్షేత్రానికి చేరుకొని రూ.78 వేల సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టు తయారీ


నిందితుడు సలీం, స్వాధీనం చేసుకున్న సామగ్రి

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న కేంద్రంపై సౌత్ వెస్ట్ టాస్క్‌ఫోర్స్, లంగర్ హౌస్ పోలీసులు దాడి చేసి పెద్ద ఎత్తున కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌లోని జేబాబాగ్ ప్రాంతానికి చెందిన సయ్యద్ సలీం(42) లంగర్‌హౌస్‌లోని డిఫెన్స్‌కాలనీలో హీనా బ్రాండ్ పేరుతో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారుచేసి విక్రయిస్తున్నాడు. పేస్ట్ తయారీకి నాసిరకం అల్లం, వెల్లుల్లితో పాటు సిట్రిక్ యాసిడ్ ఉపయోగిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు తయారీ కేంద్రంపై దాడి చేశారు. 835.5 కిలోల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్, నిమ్ముప్పు తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న అల్లం, వెల్లుల్లి ఖరీదు రూ.4,45,380 ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడిపై రాజేంద్రనగర్, వికారాబాద్, తాండూర్ ఠాణాల్లో కేసులు నమోదైనట్లు విచారణలో తేలింది.

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం: బద్దూరి

పూడూరు, న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడాకారులకు తనవంతు సహాయం అందిస్తానని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పెద్దఉమ్మెంతాల్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటలతో కలిగే ప్రయోజనాలను వివరించారు.

సేవా భావంతో పనిచేస్తేనే గుర్తింపు


మంచినీటి సీసాలు అందజేస్తున్న డిపో మేనేజరు కరుణశ్రీ

పరిగి, న్యూస్‌టుడే: కార్మికులు సేవా భావంతో పనిచేస్తేనే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఆర్టీసీ డిపో మేనేజరు కరుణశ్రీ అన్నారు గురువారం రాత్రి సిబ్బందికి మంచినీటి సీసాలు అందజేశారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దీపావళి పండుగకు గణనీయమైన ఆదాయాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం


సభ్యత్వాన్ని అందిస్తున్న మారుతికిరణ్

పరిగి, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని పరిగి అసెంబ్లీ భాజపా ఇన్‌ఛార్జి బూనేటి మారుతి కిరణ్, గణాపూర్ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, ఉపాధ్యక్షుడు రామూయాదవ్, జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి శివరాజు అన్నారు. గురువారం పరిగిలో చేపట్టిన సభ్యత్వ నమోదులో భాగంగా పలువురికి సభ్యత్వాన్ని అందజేశారు.

రోటిబండ తండా బడికి కొత్త సొబగులు

దుద్యాల, న్యూస్‌టుడే: రోటిబండ తండా పాఠశాలకు గురువారం మరమ్మతులు పనులు చేయించారు. పాఠశాల కిటికీలు శిథిలావస్థకు చేరి పనికిరాకుండా పోవడం, పైకప్పులో సిమెంట్ పెచ్చులూడి కింద పడటంతో పంచాయతీ కార్యదర్శి ఆనంద్ వాటికి మరమ్మతు పనులు చేపట్టారు. నూతనంగా కిటికీలు అమర్చి పైకప్పునకు సిమెంట్ వేయించారు.

అందని బిల్లులు.. పెరుగుతున్న ధరలు

● మధ్యాహ్న భోజన నిర్వాహకులకు తప్పని తిప్పలు


ఆదర్శ పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, పూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే వారికి కష్టాలు తప్పడం లేదు. నెలలుగా బిల్లులు, ప్రతి నెలా రావాల్సిన రూ.3 వేల పారితోషికం కూడా సమయానికి అందడం లేదు. రోజుకో తీరు కూరగాయలతో కూడిన భోజనం ఇవ్వాలని మెనూలో ఉన్నా.. కాసులు లేక కష్టాలు తప్పడం లేదు. జిల్లాలోని కొడంగల్, పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల పరిధిలో 1,030 పాఠశాలల్లో 94 వేల విద్యార్థులు వివిధ తరగతుల్లో చదువుతున్నారు.


మీర్జాపూర్‌లో విద్యార్థులు

అన్నీ కొనాల్సిందే..

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు ప్రభుత్వం స్థానిక స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు బాధ్యతలు ఇచ్చింది. విద్యార్థుల సంఖ్యను బట్టి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పట్టణాల్లోని ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నెలకు సరిపడా సన్నబియ్యం మాత్రమే పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. కూరగాయలు, కారం పొడి మంచినూనె, కందిపప్పు, చింతపండు, ఉప్పు, పసుపు తదితర సరకులన్నీ సమకూర్చుకోవాల్సిందే. దీంతో చేసేది లేక తెలిసిన వారి కిరాణా దుకాణాల్లో నుంచి ఉద్దెరలో సమకూర్చుకుని వంటలు తయారు చేస్తున్నారు.

చెల్లింపులు ఇలా..

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రోజుకు ఒక్కరికి రూ.5.45. ప్రాథమికోన్నత విద్యార్థులకు రూ.7.45 గుడ్డుకు అదనంగా రూ.5 ఇవ్వాల్సి ఉంది. ఉన్నత పాఠశాల విద్యార్థులకు గుడ్డుతో కలిపి ఒక్కో విద్యార్థికి రూ.10.65 చెల్లిస్తున్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం సోమ, బుధవారాల్లో గుడ్డు కూరగాయలు, మంగళవారం ఆకు కూరలతో కూడిన పప్పు, గురువారం సాంబారుతో పాటు కూరగాయలు, శుక్రవారం గుడ్డు పప్పుతో కూరగాయలు, శనివారం కూరగాయలతో కూడిన బిర్యానీ అందించాల్సి ఉంది. ఇటీవల టమాటా కిలో రూ.80, ఉల్లిగడ్డ రూ.60, మంచినూనె కిలో రూ.150 వరకు పెరిగాయి. కోడిగుడ్డు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో నిర్వాహకులకు ఆర్థికంగా భారంగా మారుతోంది.

పై అధికారుల దృష్టికి..

మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు బిల్లులు సకాలంలో రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినెలా సక్రమంగా అందించే విధంగా సమస్యను వెంటనేపై అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. రోజువారీగా విద్యార్థుల హాజరు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయించి పంపుతున్నాం. సమస్య పరిష్కారం అయ్యి సకాలంలో బిల్లులు వచ్చే విధంగా చూస్తాం. సాయిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎంఈవో, పూడూరు

ఆట వస్తువులు వచ్చేశాయ్


యాలాల బాలుర వసతిగృహం

యాలాల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంతో పాటు పెద్దేముల్ మండల వసతిగృహంలో ఉన్న విద్యార్థులకు నాలుగు జతల దుస్తులు, ఆట వస్తువులు అధికారులు అందజేశారు. వసతి గృహాధికారి బాల్‌రాజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

నేత్రాలను జాగ్రత్తగా కాపాడుకోండి

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: మానవ శరీరంలో అతి ముఖ్యమైన అంగాల్లో నేత్రాలు ప్రధానమని వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని శ్రీ సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణగౌడ్ అన్నారు. గురువారం శ్రీ సత్యసాయి సేవా సమితి, మ్యాక్సీవిజన్, (హైదరాబాద్) కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కొడంగల్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఇందులో 22 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నాయని డాక్టర్ హరినాథ్ నెహ్రూ తెలిపారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి పాలమూరులోని రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్‌తో పాటు మందులు, అద్దాలు అందిస్తామని వివరించారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

బోర్ల మరమ్మతులపై అవగాహన

పరిగి, న్యూస్‌టుడే: గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం కింద పనిచేస్తున్న సహాయకుల శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా మిషన్ భగీరథ అధికారులు క్షేత్ర సందర్శనలో భాగంగా రాఘవాపూర్ శివారులో ఉన్న నీటి శుద్ధిప్లాంటుకు తీసుకువెళ్లి తాగు నీటి పంపిణీ విధానం వివరించారు. అనంతరం బోర్ల మరమ్మతులపై ప్రత్యక్ష అవగాహన కల్పించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఈఈ చల్మారెడ్డి, డీఈఈ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో కరీం, ఏఈ విపుల్, ఎంపీఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.